పేరు మార్చి.. ఏమార్చి..

- ఇష్టారాజ్యంగా పిల్లలు తినే స్నాక్స్ అమ్మకాలు
- విషతుల్యం అవుతున్నా అదే దందా
- అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకుంటున్న పిల్లలు
- అనుమతులు లేకుండానే తయారీ
- ఆహార భద్రత విభాగం దాడులు అరుదు





దాబాగార్డెన్స్: ఆకర్షణీయమైన రంగులు.. ఆకట్టుకునే ప్యాకింగ్.. అంతకు మించి మాయ చేసేలా ప్రకటనలు.. పేరేదైతేనేం పిల్లల్ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి స్నాక్స్. వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. అడిగింది కొనిచ్చే తల్లిదండ్రులున్నంత వరకూ కల్తీ రాయుళ్ల కహానీలు నడుస్తూనే ఉంటాయని మార్కెట్‌లో ప్రతి చిల్లర దుకాణం ముందు వేలాడే ప్యాకెట్లు చెబుతుంటాయి. తిను బండారాల్లో రుచి పెంచేందుకు, నిల్వ ఉంచేందుకు అవసరమైన రసాయనాల్ని అధిక మోతాదులో వాడేస్తూ.. చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. అనుమతి లేకపోయినా పుట్టగొడుగుల్లా కంపెనీలు వెలుస్తున్నాయి. ఏదైనా ప్రముఖ కంపెనీ తయారు చేసే ఉత్పత్తుల్ని పోలి ఉన్న తినుబండారాల్ని ప్యాకింగ్‌తో సహా కాపీ కొట్టి పేరు మార్చి.. ఏమార్చి అమ్మేస్తున్నారు. ఎక్కడ చూసినా స్నాక్స్ ప్యాకింగ్ ఉత్పత్తులే దర్శనమిస్తుంటాయి. చాక్లెట్లు, బిస్కెట్లు, చిప్స్, మిక్చర్, బేకరీ ఫుడ్.. పొటాటో చిప్స్.. ఇలా ప్రతి తినుబండారాన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే అమ్మకాలు సాగించేస్తున్నారు.

మురికివాడలు.. పేద.. బడుగు.. బలహీన వర్గాల నివాసాల వద్ద ఈ అమ్మకాలు మరీ ఎక్కువగా జరుగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని కొబ్బరితోట, జాలారిపేట, ఫిషింగ్ హార్బర్, ఫెర్రీరోడ్డు, కోట వీధి, అల్లిపురం, పూర్ణామార్కెట్, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, పెరికివీధి, జబ్బర్‌తోట, రెల్లివీధి, థామ్సన్ స్ట్రీట్, పాతపోస్టాఫీస్, చెంగల్రావుపేట, అంబుసరంగ్ వీధి, పద్మానగర్, లక్ష్మీటాకీస్, వెలంపేట, దిబ్బలపాలెం తదితర ప్రాంతాలతో పాటు ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల వద్ద వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

రుచి కోసం రసాయనాలు..

కంటికి అందంగా కనిపించే వాటిపై పిల్లలు ఇష్టం చూపిస్తుంటారు. ఈ బలహీనతే వ్యాపారులకు బలంగా మారింది. ముఖ్యంగా తమ ఉత్పత్తులు ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలు అధిక మోతాదులో వినియోగించేస్తున్నారు. చిప్స్, కుర్‌కురే తరహా ఉత్పత్తులు, చాకో చిప్స్, కార్న్ చేగోడీలు ఇలాంటి వాటికి రుచి పెంచేందుకు పెట్రోలియం ఉత్పత్తుల్ని వినియోగించడం వల్ల ఈ స్నాక్స్ రుచికరంగానూ, కంటికి కనిపించే విషయంలో అందంగానూ ఉంటాయి. దీంతో పాటు బిస్కెట్లు, కార్న్ చిప్స్‌లో పశువుల దాణా, కల్తీ నూనె కూడా కలిపేస్తుంటారని గతంలో జరిగిన పరిశోధనల్లో వెల్లడైంది.

నిల్వ ప్యాకెట్లతో అనారోగ్యం..

కిరణా/పాన్‌షాపుల్లో ఎక్కడ చూసినా లేసు ప్యాకెట్ల దర్శనమే. ప్రతి షాపు ముందు లేసు ప్యాకెట్లు తోరణాలుగా వేలాడదీస్తున్నారు. వాటిని చూడగానే పిల్లలకు నోరూరుపోతుంది. వాటిని కొనాలంటూ వారి తల్లిదండ్రుల వద్ద మారాం చేస్తుంటారు. ఆ ప్యాకెట్లలో పిల్లల్ని ఆకర్షించడానికి చిన్నపాటి ప్లాస్టిక్ బొమ్మలు అమర్చుతున్నారు. అయితే ఈ ప్యాకెట్లు నెలల తరబడి నిల్వ ఉండడంతో వాటిని ఎక్కువగా తినే పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని వైద్యులు అభిప్రాయపడతున్నారు.

ధర తక్కువ.. రోగాలెక్కువ..

సాధారణంగా ప్రముఖ కంపెనీలకు చెందిన చిప్స్ ప్యాకెట్ రూ.20కి మార్కెట్లో లభిస్తుంటే.. స్థానికంగా ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేసిన ప్యాకెట్ రూ.5 నుంచి రూ.10కే లభిస్తుంది. వర్తకులకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ప్యాకెట్‌పై ఒక రూపాయి లాభం వస్తే.. స్థానికంగా తయారు చేసే ప్యాకెట్‌పై రూ.3 వరకు లాభాన్ని గడిస్తున్నారు. వీరి జేబులు నిండుతున్నా.. వీటి వల్ల పిల్లలకు దీర్ఘకాలంలో సోకే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఇన్‌ఫెక్షన్లు, తలనొప్పి, రక్తపోటు, నరాల బలహీనత, స్థూలకాయం, బీపీ, ఆస్తమా, ఎదుగుదల లోపం వంటి రోగాలకు దారి తీస్తాయి. అదే విధంగా కొన్ని క్యాన్సర్ కారకాలూ శరీరంపై దాడి చేసే అవకాశముంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిల్లల్లో పెరుగుదల నిలిచిపోతుంది..



జంక్ ఫుడ్స్ వల్ల పిల్లల్లో పోషకాలు లోపించి పెరుగుదల నిలిచిపోతుంది. ప్యాకెట్లలో లభించే వస్తువుల్లో కారం, ఉప్పుకు బానిసలై ఎంత తింటున్నారో, ఏం తింటున్నారో తెలియడం లేదు. కొన్ని సార్లు టీవీ.. ఫోన్ చూస్తూ అన్నం కంటే ఎక్కువగా తింటున్నారు. ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం. పూర్వం రోజుల్లా తల్లులు ఇంటి వద్దే జంతికలు, చేగోడీలు, కొబ్బరి ఉండలు, పప్పుండలు, పాలకాయలు, నువ్వుండలు చేసి పెట్టడం శ్రేయస్కరం. దీనివల్ల డబ్బు ఆదా అవ్వడంతో పాటు నాణ్యమైన తయారీ కనుక చిన్నారుల ఆరోగ్యం బాగుంటుంది. బయట దొరికే తినుబండారాలు ఒక్కోసారి ప్రాణాల మీదకు తెస్తాయి. ముఖ్యంగా తినుబండారాల్లో బొమ్మలు కలిపి విక్రయించడం నిషేధించాలి.

– డాక్టర్ రొంగలి అచ్చెంనాయుడు, పిల్లల వైద్య నిపుణుడు



అధికారులు నిద్రపోతున్నారు..





ఫుడ్‌సేఫ్టీ అధికారులు నగరంలో నిద్రపోతున్నట్లే ఉంది. ఏ చిల్లర దుకాణం వద్ద చూసినా ఊరు, పేరు లేని చిప్స్ ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. దాడులు చేసి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–బుల్లెట్ రవి, మహారాణిపేట

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణా ధికారి కె తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు పొమ్మంటే.. 'టీఎస్‌ఆర్' ఆశ్రయమిచ్చింది



టీఎస్‌ఆర్ షెల్టర్‌లో నారాయణరావు

సీతమ్మధార: బ్యాగుతో ఉన్న వ్యక్తి పేరు వడ్డి నారాయణరావు (61). అక్కయ్యపాలెం. భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్తి మొత్తం తీసుకుని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అనారోగ్యం కారణంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఇది గమనించిన జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది టీఎస్‌ఆర్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

ఒడ్డుకు కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

అల్లిపురం: ఆర్కేబీచ్‌సమీపంలోని చిల్డ్రన్ పార్కు వద్ద గుర్తు తెలియని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. పోలీసులు, వేంకటేశ్వరనగర్ సచివాలయం వీఆర్‌వో గౌరీ కాంత్ అనూష తెలిపిన వివరాల ప్రకారం సుమారు 30–40 ఏళ్ల వ్యక్తి చామనఛాయ రంగు శరీరం, 5.3 అడుగుల ఎత్తు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామన్నారు. శరీరం పూర్తిగా డీ కంపోజ్ కావడంతో గుర్తుపట్టని విధంగా ఉందన్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడిన వన్‌టౌన్ పోలీసులు



కేజీహెచ్‌లో వృద్ధుడి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: గురువారం ఉదయం 7.30 గంటలకు సుష్మిత అనే మహిళ నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. పాతనగరంలో అన్నా క్యాంటీన పక్కన ఓ వ్యక్తి రక్తస్రావంతో పడిపోయి ఉన్నాడని ఆ ఫోన్ సందేశం. సమాచారం అందుకున్న నగర పోలీస్ కమిషనర్ వెంటనే వన్‌టౌన్ సీఐ జీడీ బాబుకు సమాచారమిచ్చారు. వెంటనే వైద్య సహాయం అందివ్వాలని ఆదేశించారు. సీఐ జీడీ బాబు నేతృత్వంలో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది సంఘట స్థలికి చేరుకున్నారు. రక్తస్రావంతో పడి ఉన్న ఆ వృద్ధుడ్ని కేజీహెచ్‌కు తరలించారు. వైద్యులతో మాట్లాడి అత్యవసర సేవలు అందించారు. ఆ వృద్ధుడ్ని కాపాడారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

మద్దిలపాలెం: చట్టాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను లైగింక దాడులు, వేధింపుల నుంచి పోక్సో చట్టం-2012 రక్షిస్తుందన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే నిందితులకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడానికి, వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని వెంకట శేషమ్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ సిహెచ్.అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న రేణుక యల్లమ్మ దేవాలయంలో మహానారాయణ సేవ



న్యాయవాది యల్లపు సూర్యానారాయణమూర్తిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన మహా నారాయణసేవ నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు దేవాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన నారాయణ సేవలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి న్యాయవాది యల్లపు సూర్యానారాయణమూర్తి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు సభ్యులు కర్రి నీలకంఠం, కార్యదర్శిబొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, గణగల్ల సత్యవతి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు కామేశ్వరశర్మ ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పీల వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ నెల 5, 6, 7 తేదీలలో అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. దీంట్లో భాగంగా అమ్మవారి మహా నారాయణసేవ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాదు, కమిటీ సభ్యులు ఉపాధ్యక్షుడు కొణతాల గణేష్, తమరపు మధు తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టర్ కార్యాలయం వద్ద బీఎంఎస్ నిరసన

దాబాగార్డెన్స్: భారతీయ మజ్దూర్ సంఘ్ పిలుపు మేరకు ఈ నెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు సంఘ్ ప్రధాన కార్యదర్శి మోటూరు వెంకట సన్యాసినాయుడు పేర్కొన్నారు. 1995లో ఈపీఎఫ్ స్కీంని సవరించి ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలు పరచడం మొదలు పెట్టారన్నారు. ఈ స్కీంలో కనీస పెన్షన్‌కు ఎక్కడా కూడా హామీ లేదని గుర్తించిన బీఎంఎస్ చేసిన ప్రయత్నాల వల్ల 2014 నుంచి కనీస పెన్షన్ రూ.వెయ్యికి పెంచడం జరిగిందన్నారు. కనీస పెన్షన్ రూ.వెయ్యి ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్ల సహాయం చేస్తుందని, ధరలు పెరుగుదల కారణంగా గత కొన్నేళ్లగా బీఎంఎస్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రూ.వెయ్యి నుంచి కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వస్తోందన్నారు. అలాగే 78 లక్షల ఈపీఎస్ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వ ఆయిష్మాన్ భారత్ మెడికల్ స్కీమ్‌ని అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ గత నెల 10, 11, 12 తేదీల్లో గౌహతిలో నిర్వహించిన బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించిన పిదప ఈ నెల 18న దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టే నిరసనలో పెద్ద ఎత్తున ఈపీఎస్ 96 పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.

జిల్లా పరిషత్‌లో మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) రాసిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో ఒక అద్భుతమైన కావ్యంగా నిలిచిందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రముఖ తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ 16వ శతాబ్దంలో జీవించిన మొల్లమాంబ సాహిత్య కృషిని వివరించారు. సరళమైన భాషలో కథనాన్ని అందించడంలో ఆమె ప్రత్యేకతను సీఈవో కొనియాడారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి సీఈవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పలు విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంపీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

మహారాణిపేట: డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 26వ రాష్ట్ర అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 8వ తేది నుంచి 11వ తేదీ వరకు గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో వివిధ క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్ పోటీలో కెప్టెన్ కరుణాకర్ రాజు నేతృత్వంలో ఏఎంసీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలో భాను ప్రకాష్ (కెప్టెన్) ఆధ్వర్యంలో రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ స్పోర్ట్స్ కార్యదర్శి భాను సతీష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు పాల్గొన్నారు.

ఆస్తి,నీటి పన్ను బకాయిలు చెల్లించండి



నీటి పన్ను బకాయిలు చెల్లించాలని ప్రజలను కోరుతున్న జెడ్పీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీకి ఆస్తి, నీటి పన్నులు బకాయిలు చెల్లించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన జోన్ పరిధి 39వ వార్డు చిలకపేటలో పర్యటించారు. జీవీఎంసీ ఇచ్చిన కాలపరిమితి ప్రకారం బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం క్లాప్‌వాహనాలు ఇంటి వరకూ వస్తున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. తడి-పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగరాజు , సెక్రటరీలు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు సత్కారం



అనుబంధ సంఘాల నాయకులను సత్కరిస్తున్న పీతల వాసు, కనకల ఈశ్వర్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలతో ఇటీవల నియోజకవర్గ పరిధిలో పార్టీ అనుబంధ సంఘాలకు అధ్యక్షులుగా నియమితులైన పలువుర్ని 29వ వార్డు నాయకుడు పీతల వాసు, నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కనకల ఈశ్వర్ సంయుక్తంగా గురువారం సత్కరించారు. విశాఖ సౌత్ సోషల్ మీడియా అధ్యక్షుడిగా బెవర మహేష్, సౌత్ బీసీ సెల్ అధ్యక్షుడిగా బొండాడ వెంకట్రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆకుల శ్యామ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని సత్కరించారు. జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో తాడి రవితేజ, గుమ్మడి చంద్రమౌళి, ఆరుగుల రాజ్‌కుమార్, కోట వెంకట ప్రసాద్, గొలగాని మధు, పీతల ఉమా మహేష్, లీలా రాజు, పీతల చరణ్, కె సాగర్, పడాల సూర్య కుమార్, పైబోడి శివ, బొడ్డు ధనరాజు, షబీర్ పాల్గొన్నారు.

ఉత్తర భారతీయుల హోలీ సంబరాలు



నృత్యాలు చేస్తున్న ఉత్తర భారతీయులు

దాబాగార్డెన్స్: రంగుల కేళి..హోలీ పండగ సంబరం ముందుగానే దక్షిణ నియోజకవర్గానికి తాకింది. నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా నివశిస్తున్న ఉత్తర భారతీయులు హోలీ సంబరాన్ని పురస్కరించుకొని నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ రామాలయ ప్రాంగణంలో నృత్యాలు చేశారు. వారి సంప్రదాయ రీతిన ఆట పాటలతో సందడి చేశారు. దాండియా ఆడారు. రంగులు జల్లుకున్నారు. అర్ధరాత్రి వరకు ఆటపాటలతో గడిపిన వీరంతా సముద్ర తీరానికి చేరుకున్నారు. సముద్ర స్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. నియోజకవర్గ పరిధి పూర్ణామార్కెట్, బుద్ధవరపు గార్డెన్స్, మహారాణిపేట, సూర్యాబాగ్, లీలామహల్, అల్లిపురం, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు అను


దాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం (బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు)కు విశేష స్పందన వచ్చింది. ఏజ్ కేర్ ఫౌండేషన్ నేతృత్వంలో ప్రతి నెలా మూడో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా గురువారం ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైద్యురాలు అను పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్య శిబిరంలో పుండరీకాక్షయ్య, ప్రసాదనాయుడు, సుమతి, కమల ప్రియ, సాయి, శ్రీను వైద్య బృందంతో పాటు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హోలీ పౌర్ణమి ఏర్పాట్లు పూర్తి

సత్య దేవుని ఆలయానికి పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి



సత్యదేవుని ఆలయం

దాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యత గల ఇసుకకొండ (బాబాజికొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో హోలీ పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. హోలీ పౌర్ణమి ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ముందుగా చాలా మంది భక్తులు సాగరతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి రానున్నారు.

4 గంటల నుంచే పౌర్ణమి పూజలు..

వేకువజాము 4 గంటలకు వేదమంత్రాలతో ధ్వజ స్తంభ పూజ నిర్వహించనున్నారు. పూజలు అనంతరం ధ్వజస్తంభం చుట్టూ పంచ ప్రదక్షిణ, స్వామి తొలి దర్శనం భక్తులకు కల్పించనున్నారు. ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు సత్యనారాయణస్వామిని దర్శించుకోవచ్చు. స్వామి మొదటి, మూడో బ్యాచ్ వ్రతాలు ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు విశేష ప్రత్యేక వ్రతాలు నిర్వహించనున్నారు. రెండో బ్యాచ్ ఉదయం 8.30 గంటలకు సాధారణ వ్రతాలు జరపనున్నారు. వ్రతంలో పాల్గొనే భక్తులు గంట ముందు ఆలయానికి రావల్సి ఉంది. వ్రతంలో పాల్గొనదలచే భక్తులు రెండు కొబ్బరికాయలు, అరడజన్ అరటిపళ్లు, విడి పువ్వులు తెచ్చుకోవాలి.

ఏర్పాట్లు పూర్తి

హోలీ పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాం. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సదుపాయం కల్పించాం. పెండాల్స్ ఏర్పాటు చేశాం. భక్తుల దర్శనార్థం వివిధ ఆలయాల నుంచి సిబ్బందిని ఏర్పాటు చేశాం. వన్‌టౌన్ పోలీసుల బందోబస్త్ ఏర్పాటు చేశాం.

–రాజగోపాలరెడ్డి, ఆలయ ఈవో, ఇసుకకొండ(బాబాజీకొండ) సత్యనారాయణస్వామి ఆలయం.

'మీ కోసం..మీ పోలీసు' కార్యక్రమానికి శ్రీకారం



ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

దాబాగార్డెన్స్: నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఇక నుంచి పాతనగరం ప్రజలకు డోర్ డెలివరీ సేవలు అందించనున్నారు. దీనిలో భాగంగా మీ కోసం మీ పోలీస్ కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ జీడీ బాబూ శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ప్రజల వద్దకే పోలీసు సేవలు..

సాధారణంగా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు నమోదు చేయించుకునే వారు. ఇక నుంచి పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా..పోలీసులకు సమాచారమిస్తే ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా పోలీసులే నేరుగా మీ ఇంటికి వచ్చి మహిళలు, వృద్ధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. అంతేగాక లా అండ్ ఆర్డర్...తదితర పోలీస్ సమస్యలపై అవగాహన కల్పిస్తారు. అలాగే సైబర్ నేరాలు, దొంగతనాలు, చిట్టీల మోసం తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.పోలీసుల సహాయం కావాలంటే వన్‌టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీడీ బాబును 9440796019 నంబరుకు ఫోన్ చేస్తే సరిపోతుంది.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

దాబాగార్డెన్స్: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), స్కిల్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు మూడు నెలల టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ అందివ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండాలని, దరఖాస్తులు ఈ నెల 19వ తేదీలోగా అందజేయాలని, మరిన్ని వివరాలకు 9121676360 నంబరులో సంప్రదించవచ్చు.